# సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 17 । ఏప్రిల్ । 2025




## చిరుతను చంపింది ఎవరు.?

మదనపల్లె మండలం పొన్నూటిపాళ్యం అటవీ ప్రాంతంలో బుధవారం వేటగాళ్ల ఉచ్చులో చనిపోయిన చిరుత విషయంలో ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. -8లో



## ఆధునిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు

అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరిజ్ఞానం ద్వారా కేసుల దర్యాప్తులో వేగం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.100 | రూ.120 |
| రెండోరకం | రూ.60 | రూ.90 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 58 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| సీబీ | 451 | 451 |
| బైవోల్టిన్ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 34.360 కిలోలు

## న్యూస్‌రీల్

### కందుల కొనుగోలు గడువు పెంపు



**రాయచోటి జగదాంబ సెంటర్:** నాఫెడ్ వారి ఆధ్వర్యంలో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లాలో కంది పండించిన, ఈ క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి మద్దతు ధర్‌పై ఒక క్వింటా రూ.7,550 కందులు కొనుగోలు చేసేందుకు గడువును ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించింది. ఈ విషయాన్ని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ త్యాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు గడువు గతంలో ఈ నెల 15 వరకు ఉందని, ప్రస్తుతం 19వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**రాయచోటి జగదాంబసెంటర్:** జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లు రూ.200, ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశాలు 10వ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఇవ్వనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు డీఈఓ కార్యాలయంలో కానీ సంబంధింత మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

### విజయానికి అవగాహనే అస్త్రం



మాట్లాడుతున్న పూర్ణిమ

**కురబలకోట:** ఏ రంగంలో నైనా విజయానికి అవగాహన అస్త్రం లాంటిదని, విద్యార్థులు ఉద్యోగం సాధించాలంటే లర్న్, అడాప్ట్, స్కిల్ చేంజింగ్ ఎబిలిటీ అనే మూడు క్వాలిటీలు ఆవశ్యకమని బెంగళూరు మైక్రోసాఫ్ట్ అజురే ఏఐ ఎంవీపీ ఎస్. పూర్ణిమ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు తర్వాత మంచి ఉద్యోగం సాధించాలని కలలు కంటారన్నారు. ఇందుకు తాజా టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇందుకు మైక్రోసాఫ్ట్ స్టూడెంట్స్ క్లబ్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, నాయకత్వ నైపుణ్యాలు, గ్లోబల్ టెక్నాలజీ ట్రెండ్స్‌పై అవగాహన పెంచుకోవచ్చన్నారు. ప్రాజెక్టులు, హ్యాక్‌థాన్ ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని పొందడంతో పాటు నాయకత్వ నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు.

# కొరత.. కలత



- పేదల బియ్యానికి రెక్కలు?
- జిల్లాలో 202 చౌక దుకాణాల్లో కొరత
- గడువు ముగుస్తున్నా బియ్యం పంపిణీ చేయలేదని రేషన్‌కార్డుదారుల నిరసన







బి.కొత్తకోట బీసీకాలనీలో బియ్యం ఇవ్వలేదని కార్డులతో మహిళల నిరసన

**బి.కొత్తకోట:** జిల్లాలో పేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో ఒకటైన బియ్యం కొరత పేదలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యావసరాల పంపిణీ రేపటితో ముగుస్తుండగా బియ్యం కోసం పేదలు ఎదురు చూస్తున్నారు.జిల్లా అధికారులు కొరత బియ్యం వ్యవహారాన్ని పక్కనపెట్టి అదనంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. దీంతో ఇప్పటికి ఇబ్బంది తీరినా వచ్చేనెలలో దీన్ని ఎలా అధిగమిస్తారు.. అసలు బియ్యం కొరత ఎందుకు వచ్చింది.. చౌకదుకాణాల్లో మిగులు బియ్యం ఏమైపోతోంది అన్న అంశాలపై క్షుణ్ణంగా విచారిస్తేకాని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు. రెండేళ్ల క్రితం తంబళ్లపల్లె స్టాక్ పాయింట్‌లో వెయ్యి టన్నులకుపైగా బియ్యం మాయమైన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం అవుతున్నాయా లేక నిజంగా ఏ అవకతవకలు జరగకుండానే బియ్యం కొరత వచ్చిందా, కారణాలేమిటి అన్నది తేల్చాల్సింది అధికారులే.

**10 శాతం అదనం సరఫరా**

ఈనెలలో పేదలకు అందించే బియ్యం పంపిణీలో కొరత కారణంగా 202 చౌక దుకాణాలకు కోటాలో 10శాతం అదనంగా బియ్యం సరఫరా చేశారు. ఈ బియ్యాన్ని ఈనెలలో ఇప్పటివరకు తీసుకోలేని పేదలకు పంపిణీ చేస్తున్నారు. ఇందులో బి.కొత్తకోట, రాజంపేట, రాయచోటి నియోజకవర్గాలకు చెందిన 13 చౌకదుకాణాలకు అదనంగా మరో 10 శాతం కలుపుకుని మొత్తానికి 20 శాతం బియ్యం అదనంగా సరఫరా చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ అదనపు బియ్యం పంపిణీని కార్డుదారులకు అందించే చర్యలు చేపట్టారు. దీంతో ఈనెలకు సమస్య తీరినట్టే.

### బి.కొత్తకోటలో నిరసన

బియ్యం పంపిణీ గడువు ముగుస్తున్నా బియ్యం ఇవ్వకపోవడంతో బుధవారం బి.కొత్తకోట బీసీకాలనీకి చెందిన మహిళలు రేషన్‌కార్డులు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. రాయితీ బియ్యంపై ఆధారపడిన తమకు ఈనెల కోటా ఇవ్వకపోతే కుటుంబం గడిచేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పౌరసరఫరాలశాఖ అధికారులు మాట్లాడుతూ షాపునకు బియ్యం సరఫరా చేస్తున్నామని.. కార్డుదారులకు బియ్యం అందిస్తున్నట్టు చెప్పారు.

### మిగులు బియ్యం ఏమైంది

జిల్లాలో 202 చౌక దుకాణాల పరిధిలో ఈనెల బియ్యం కొరత వచ్చింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగిన పంపిణీలో సగటున లెక్క వేసి బియ్యం స్టాక్‌పాయింట్లకు అక్కడి నుంచి డీలర్లకు సరఫరా చేశారు. దీంతో లెక్క సరిపోవాలి. అయినా బియ్యం కొరత ఎందుకొచ్చింది అన్నదే ఇక్కడ వ్యక్తం అవుతున్న అనుమానం. గతనెల మిగులు బియ్యం, తాజాగా సరఫరా అయిన స్టాక్‌తో ఏ సమస్య రాకూడదు. అయితే గత రెండు, మూడు మాసాలుగా బియ్యం కొరత వస్తోందని అంటున్నారు. దీనికి కారణమేమిటో అధికారులే చెప్పలేకపోతున్నారు. డీలర్ల వద్ద ఉండాల్సిన మిగులు బియ్యం ఏమైంది, ఈ బియ్యానికి లెక్కలు ఉన్నాయా లేదా అన్నది చర్చనీయాంశమైంది. మిగులు బియ్యం కలుపుకుని పంపిణీ చేసుంటే అసలు ఈ సమస్యే లేదని కూడా అంటున్నారు. దీన్ని ఉన్నతాధికారులు ఏ విధంగా విచారిస్తారో లెక్కలను వెలికి తీస్తారో లేదో చూడాలి.

### సాధారణంగా జరిగేదిదే

జిల్లాలోని 30 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో 1,123 చౌక దుకాణాలు నడుస్తున్నాయి. ఇందులో పేదలకు మంజూరైన 4,97,969 రేషన్ కార్డులు ఉన్నాయి. ఏడువేల టన్నులకుపైగా బియ్యాన్ని పేదలకు అందిస్తున్నారు. ప్రతినెలా ఎండీఎం వాహనాల ద్వారా పేదల ఇళ్ల వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేస్తారు. ప్రతినెలా స్టాక్ పాయింట్ల నుంచి ఆయా చౌకడీలర్ల పరిధిలో ఎన్ని కార్డులుంటే అన్నింటికి సరిపడా బియ్యం సరఫరా చేస్తారు. ఇక్కడినుంచి ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. ఇందులో ముఖ్య విషయం ఏంటంటే.. చౌక డీలర్లు ప్రతినెలా పొందే స్టాకులో పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ జరగదు. ఏ డీలర్ పరిధిలో ఎంత స్టాక్ మిగులుతుందో ఆ స్టాక్‌ను మినహాయించుకుని వచ్చేనెల కోటాను సరఫరా చేయడం అనవాయితీ. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఇంతటితో పేదలకు బియ్యం పంపిణీ సవ్యంగా జరగాలి. అయితే ఇక్కడే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### సగటు లెక్కన ఇచ్చాం



బియ్యం కొరత వచ్చిన చౌక దుకాణాలకు అదనంగా అందించి సమస్యను పరిష్కరించాం.సాధారణంగా గతనెలల్లో పంపిణీ జరిగిన బియ్యం సగటు ఆధారం చేసుకుని సరఫరా జరుగుతుంది. ఆ విధంగా గతనెల స్టాక్ మిగులు ఆధారంగా స్టాక్ పాయింట్ నుంచి దుకాణాలకు బియ్యం అందించాం. అయితే కొరత ఎలా వచ్చిందన్న దాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-రఘురాం, జిల్లా పౌర సరఫరా అధికారి

### మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

**రాయచోటి జగదాంబసెంటర్:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీల వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.గౌస్‌బాషా బుధ వారం తెలిపారు. జిల్లా పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులకు సమ్మర్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడా సంఘాల కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు వివరాలను డీఎస్‌డీఓ కార్యాలయానికి తెలియజేయాలని ఆయన తెలియజేశారు.

### అసంపూర్తి ఇళ్లకు ఆర్థిక సాయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సాంబశివయ్య

**పెనగలూరు:** గతంలో పక్కా ఇళ్లు మంజూరై, వివిధ కారణాల వల్ల నిర్మాణ పనులు పూర్తిచేయలేకపోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నదని పీడీ సాంబశివయ్య తెలిపారు. బుధవారం మండలంలోని కొండూరు పంచాయతీ కేసీ ఎస్టీ సముద్రం కాలనీలో హౌసింగ్ లబ్ధిదారులతో పీడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి గతంలో మంజూరైన పక్కా గృహాల లబ్ధిదారులకు పాత బిల్లుతో కలిపి అదనంగా రూ. 75 వేలు కలిపి ఇస్తున్నామని తెలిపారు. పురోగతిలో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం చేసేందుకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ మురళీకృష్ణ, ఏఈ హరిప్రసాద్, సర్పంచ్ రామాంజులమ్మ పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

**సిద్దవటం:** ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ సురేష్ బాబు తెలిపారు. సిద్దవటంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని టక్కోలు, మాచుపల్లె గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మనం తినే ఆహారం అంతా విషపూరితమే అని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై మహిళా సమాఖ్యలతో భాగస్వామ్యం , ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. రైతు సాధికార సంస్థ.. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య సంఘాలతో సంప్రదించి ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్, అదనపు ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ, మండల వ్యవసాయధికారి రమేష్‌రెడ్డి, ఏపిఎం సుజాత, మండల సమాఖ్య అధ్యక్షురాలు , వివోఏలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

**కడప సెవెన్ రోడ్స్:** మండల స్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అన్నారు. బుధవారం జెడ్పీలో జిల్లాలోని ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో మండలాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మెన్ పిట్టు బాలయ్య, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా పరిషత్ ఏవోలు పాల్గొన్నారు.

## ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

**రాయచోటి:** ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకర్లు వందశాతం రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 2025-26లో ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక కింద ఏపీ ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ వైబ్‌సైట్ ద్వారా ఎస్సీల స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు అంశంపై బ్యాంకర్లతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2025-26లో ఎస్సీ ప్రణాళిక కింద జిల్లాకు 563 యూనిట్లను కేటాయించారని కలెక్టర్ తెలిపారు. 563 యూనిట్లకు వివిధ సెక్టార్లలో రూ. 2341 లక్షల రుణాలు ఇవ్వాలని, ఇందులో రూ. 924 లక్షలు 40 శాతం మేర రాయితీగా పరిగణిస్తారని తెలిపారు.

**జిల్లాకు 34 డ్రోన్ యూనిట్లు.....**

వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ డ్రోన్లను ఉపయోగించడం ద్వారా అత్యుత్తమమైన ఫలితాలను పొందేందుకు ప్రభుత్వం రైతులకు చేయూతను అందిస్తోందన్నారు. ఈ క్రమంలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెంచడానికి కూడా రుణాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. జిల్లాకు 34 డ్రోన్లు యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. 80 శాతం రాయితీతో డ్రోన్ యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ చంద్ర నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

విద్యార్థులు విద్యతోపాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమ శిక్షణతో వాటిని సాధించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి గ్రాండ్ ప్రైజ్ (లాప్‌టాప్) టాబ్, ఫస్ట్ ప్రైజ్‌తో పాటు గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారు సాధించిన ల్యాప్‌టాప్, ట్యాబ్, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లను బహూకరించి అభినందనలు తెలిపారు.

# సారూ.. తాగునీరేది?



తంబళ్లపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేయని ఆర్వో ప్లాంటు



మదనపల్లెలోని అనపగుట్ట మున్సిపల్ స్కూల్‌లో భోజనం కోసం క్యూలో విద్యార్థులు

- పాఠశాలల్లో మోగని నీటి గంట
- పని చేయని ఆర్వో ప్లాంట్లు
- గంటకే ఖాళీ అవుతున్న సీసా నీరు
- దాహార్తితో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

**మదనపల్లె సిటీ:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే గడప దాటని పరిస్థితి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో గొంతులు తడారి పోతున్నాయి. సరైన సమయానికి భానుడు భగభగమంటున్నాడు. ఉదయం నుంచే ఎండలు మండిపోతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల దాహం పెరుగుతోంది. తాగడానికి నీరు ఉండటం లేదు. అనేక స్కూళ్లలో ఇంటి నుంచి తాగేందుకు నీరు తెచ్చుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఉన్నా.. నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. మరికొన్ని స్కూళ్లలో తాగునీటి వసతి లేదు. దీంతో విద్యార్థులు దాహంతో అల్లాడుతున్నారు. అయినా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

| | |
|---|---|
| జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: | 1734 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు: | 162 |
| ఉన్నత పాఠశాలలు: | 304 |
| విద్యార్థులు: | 1,54,784 |

ఆర్వో ప్లాంట్ల వివరాలు

| | |
|---|---|
| మొదటి విడత: | 600 పాఠశాలలు |
| రెండవ విడత: | 1016 పాఠశాలలు |
| ప్రస్తుతం పని చేయని ఆర్వో ప్లాంట్లు: సుమారు | 1000 |

మంచినీరు తాగకుంటే శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ఉదయం 10, 11, 12 గంటలకు జల గంట మోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా.. సర్కారు పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్ల మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటి బాటిళ్లు ఒక్కసారిగా ఖాళీ అవుతున్నాయి.

**వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు**



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. దీంతో విద్యార్థులకు శుద్ధ జలం అందేది. ఆర్‌ఓ ప్లాంట్లు విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగపడ్డాయి. నాడు-నేడు మొదటి విడతలో 600 పాఠశాలలు, రెండో విడతలో 1016 పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో సుమారు 1000 వరకు ప్లాంట్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.

**తూతూ మంత్రంగా..**

పాఠశాల్లో నీటి గంట(వాటర్‌బెల్) కన్పించడం లేదు. ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయకపోవడంతో.. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న నీరు మొదటి గంటకే పూర్తవుతున్నాయి. దీంతో వాటర్ బెల్ కార్యక్రమం తూతూ మంత్రంగా కొనసాగిస్తున్నారు.

**అంత నీరు తాగాల్సిందే**

వైద్యనిపుణుల సూచనల ప్రకారం .. ఒకటి నుంచి మూడేళ్లలోపు పిల్లలు రోజుకు 1.3 లీటర్లు, 4 నుంచి ఆరేళ్లలోపు 1.7 లీటర్లు, ఐదు నుంచి 13 ఏళ్ల లోపు 2.4 లీటర్లు, 13 ఏళ్లు పైబడిన వారు 3 నుంచి 4 లీటర్లు తాగాలని చెబుతున్నారు. విద్యార్థులు కచ్చితంగా ప్రతి గంటన్నరకు ఒకసారి 100 ఎంఎల్ నీటిని తాగాలి. సరైన మోతుదులో నీరు శరీరంలో లేకుంటే అలసట, బాలికలకు మూత్ర సంబంధిత ఇన్‌ఫెక్షన్లు రావడం, కాళ్లనొప్పి, ఇతర సమస్యలు తలెత్తడం, ఉదర సంబంధ సమస్యలు వచ్చే అవకాశముంది.

### డీహైడ్రేషన్ ప్రమాదం

ప్రస్తుతం వేసవి కాలం కావడంతో దాహం ఎక్కువగా వేస్తుంది. అందుబాటులో నీరు లేకపోతే డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముంది. ఇందుకోసం విద్యాశాఖ జలగంట కార్యక్రమం అమలు చేస్తుంది. ఇంటి నుంచి నీళ్ల సీసా తెచ్చుకుంటున్న చిన్నారులకు అది పూర్తయితే మళ్లీ పట్టుకునే వీలులేకుండా పోయింది. ఆర్‌ఓ ప్లాంట్లు వినియోగంలోకి తేవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### ఫిర్యాదు చేశాం



ఆర్‌ఓ ప్లాంట్లు సరఫరా చేసిన వారికి ఫిర్యాదు చేశాం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయడం లేదు. సాంకేతిక సిబ్బంది రావడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి, మదనపల్లె

# నేలకొరిగిన అరటి



వైకోట గ్రామంలో గాలివానకు దెబ్బతిన్న అరటిచెట్లు

- దెబ్బతీసిన గాలి వాన
- 110 ఎకరాల్లో అరటిచెట్లు ధ్వంసం
- మూడు కోట్ల పంట నష్టం

**ఓబులవారిపల్లె:** చేతికి అందిన పంట గాలివానకు నేలమట్టం కావడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు భారీ వర్షం కురిసింది. దీనికితోడు గాలులు వీయడంతో బాలిరెడ్డిపల్లి, వైకోట, చెన్నరాజుపోడు గ్రామాల్లో అరటి, మామిడి చెట్లు నేలకొరిగాయి. వందల ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. రాలిపోయిన మామిడి కాయలు పనికిరాకుండా పోయాయి. సంవత్సరాలపాటు పెంచిన మామిడి చెట్లు వేర్లతోసహా పడిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. దాదాపు 110 ఎకరాల్లో కోత దశలో ఉన్న అరటిచెట్లు నేలవాలాయి. దీంతో రైతులకుదాదాపు మూడుకోట్ల రూపాయల పంట నష్టం వాటిల్లింది. వైకోట, చెన్నరాజుపోడు, గ్రామాల్లో నేలకొరిగిన అరటి, మామిడి చెట్లను ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పరిశీలించారు. పంటనష్టం నమోదు చేయించి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి భాస్కర్ దెబ్బతిన్న మామిడి, అరటి రైతుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

### ప్రభుత్వం ఆదుకోవాలి....



ఐదు ఎకరాల మామిడి తోటలో కాయలు, చెట్లు, కొమ్మలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాపు, కోత దశలో ఉన్న అరటిచెట్లు గాలివానకు పడిపోయాయి. కోలుకోలేని విధంగా నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

-సుంకేసుల మస్తాన్, రైతు, చెన్నరాజుపోడు, ఓబులవారిపల్లి మండలం

### నష్టపరిహారం అందించాలి



వై కోట, గాదెల గ్రామాల్లో గాలివానకు అరటి, మామిడి చెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. చేతికి అందిన పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

-మల్లెం ఈశ్వరయ్య, సర్పంచ్, వై కోట

## క్లుప్తంగా

### పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

– ఐదుగురిపై ఫిర్యాదు, కేసు నమోదు

**కడప అర్బన్ :** కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బిల్టప్ సర్కిల్ వద్ద పులివెందుల రోడ్డులో మద్యం దుకాణం వద్ద అత్యంత కిరాతకంగా సాదిక్ వలి(30) అనే వ్యక్తిని మరియాపురానికి చెందిన రాయప్ప అలియాస్ పెద్దోడు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను సేకరించారు. హత్య చేసిన వారిలో రాయప్పతో పాటు, కాలియా, బాలస్వామి అలియాస్ బాలదాసులు, మరో ఇద్దరు ఉన్నట్లు సాదిక్‌వలీ భార్య యాస్మిన్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

### మహిళపై దాడి

**ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని మాలెపాడు గ్రామానికి చెందిన కుప్పన్నగారి సుబ్బమ్మపై భూమి సమస్య విషయమై కె.క్రిష్టారెడ్డి అనే వ్యక్తి దాడి చేసి బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు బుధవారం తెలిపారు. సుబ్బమ్మ, క్రిష్టారెడ్డిల మధ్య భూ విషయంపై సమస్య ఉంది. సుబ్బమ్మ భర్త ఉషిరెడ్డి చాలా సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. ఇంటిలో సుబ్బమ్మ ఒంటరిగా ఉంటోంది. అయితే భూ సమస్య విషయంపై సుబ్బమ్మ ఇంటిపై క్రిష్టారెడ్డి దాడి చేసి బెదిరించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### తాళ్లమాపురంలో చోరీ యత్నం

– అడ్డు వచ్చిన యువతిపై దాడి చేసిన దుండగులు

**ప్రొద్దుటూరు క్రైం :** మండల పరిధిలోని తాళ్లమాపురం గ్రామంలో దుండగులు ఓ ఇంట్లో చోరీ యత్నం చేశారు. అయితే దుండగుల అలికిడిని గ్రహించి కుటుంబ సభ్యులు నిద్రలేవడంతో వారు పారిపోయారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లమాపురం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కిరాణా షాపు నిర్వహిస్తుంటాడు. కుటుంబ సభ్యులతో కలిసి అతను ప్రతిరోజు రాత్రి ఆరుబయట పడుకుంటాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటి ప్రహరీ దూకారు. అక్కడే ఉన్న కుక్క వారిని చూసి మొరగడంతో సుబ్బారెడ్డి కుమార్తె వెంకటలక్ష్మి నిద్ర లేచింది. దుండగులను చూసి ఆమె దొంగా దొంగా అంటూ గట్టిగా కేకలు వేసింది. దీంతో దుండగులు అక్కడే ఉన్న కట్టె తీసుకొని ఆమె తలపై కొట్టి పారిపోయారు. రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన వెంకటలక్ష్మిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### గాలివానకు కూలిన విద్యుత్ స్తంభాలు



దొమ్మన్నబావి దగ్గర నేల కూలిన విద్యుత్ స్తంభం

**కురబలకోట :** మండలంలో బుధవారం రాత్రి గాలి వానకు దొమ్మన్నబావి ప్రాంతంలో లెవన్ కేవీ లైన్‌కు చెందిన మూడు విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. వెంటనే విద్యుత్ సరఫరాను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పరిసర ప్రాంతాలతో పాటు నాయనబావి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అంగళ్లలో కూడా విద్యుత్ వైర్లపై కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. హుటాహుటిన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు.

# చిరుతను చంపింది ఎవరు.?

- వేటగాళ్లా.. అధికారులా.!
- ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యమే అంటున్న ప్రజలు
- గర్భిణి చిరుత కూనలతో సహా చనిపోవడంపై సర్వత్రా ఆవేదన
- ఉచ్చువేసిన వేటగాళ్లపై కఠినచర్యలు
- సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు



చనిపోయిన చిరుతను ఉచ్చు నుంచి తీసుకువస్తున్న ఫారెస్ట్ అధికారులు

**మదనపల్లె :** మండలంలోని పొన్నూటిపాళ్యం అటవీ ప్రాంతంలో బుధవారం వేటగాళ్ల ఉచ్చులో చనిపోయిన చిరుత విషయంలో ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చిరుతను బతికించే అవకాశాలు కళ్ల ముందే ఉన్నప్పటికీ, ఫారెస్ట్ అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా నిర్లక్ష్య ధోరణి కనబరచడంతోనే వన్యప్రాణి చనిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన ఘటనపై పొన్నూటిపాళ్యం గ్రామస్తులు మాట్లాడుతూ...చిరుత ఉచ్చులో పడిన విషయం ఉదయం 6 గంటలకే పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించామన్నారు. పోలీసులు ఉదయం 8 గంటలకే ఘటనాస్థలానికి చేరుకోగా, ఫారెస్ట్ అధికారులు మాత్రం 9 గంటలపైన వెటర్నరీ అధికారులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారన్నారు. వచ్చిన వెంటనే చిరుతను కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టకపోగా, అక్కడ ఉన్న జనాలను అదుపుచేయడం, ఏం చేయాలనే విషయమై చర్చించడంలోనే సమయం వృథా చేశారన్నారు. చిరుతను బంధించేందుకు వల, బోనును తీసుకువచ్చిన ఫారెస్ట్ అధికారులు డార్టింగ్ గన్ సహాయంతో ట్రాంక్విలైజర్స్ ద్వారా మత్తుమందు ఇంజెక్ట్ చేసి కాపాడాలని నిర్ణయించారు. అయితే ఫారెస్ట్ అధికారులు తెచ్చిన గన్‌కు మత్తు మందు ఎక్కించడం, దానిని ఉపయోగించడంపై అధికారులకు అవగాహన లేకపోవడం, సమయానికి అది కాస్తా పనిచేయకపోవడంతో మరింత సమయం వృథా అయింది. చిరుత ఉచ్చులో తగులుకుని విలవిలలాడటాన్ని చూసిన ప్రజల్లో నుంచి కొంతమంది, ఫారెస్ట్ అధికారులు సహకరిస్తే..తాము వలను తీసుకుని చిరుత వద్దకు వెళతామని, ఎలాగోలా విడిపించేందుకు సహకరిస్తామని చెప్పినా అధికారులు అంగీకరించలేదు. ప్రాణాలు దక్కించుకునే క్రమంలో దప్పికతో అల్లాడుతున్న చిరుతకు నీళ్లు అందిస్తామన్నా ఒప్పుకోలేదు. చిరుత భయపడుతోందని, దానికేమీ కాదని, తిరుపతి జూపార్కు చీఫ్ కన్జర్వేటర్‌కు సమాచారం అందించామని, వారు వచ్చి రక్షిస్తారని చెప్పుకొచ్చారు. అయితే ఉచ్చులో బిగుసుకున్న చిరుత దాదాపు 8 గంటలకు పైగా నరకయాతన పడుతూ, ఒంటిపై ఉన్న గాయాల బాధను భరించలేక, ఊపిరాడక మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో చనిపోయింది. దీంతో ప్రజలు ఒక్కసారిగా ఆవేశం పట్టలేక ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో సబ్ డీఎఫ్ఓ...ఉచ్చులు వేసిన వారిదే తప్పని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించే బదులు.. అడవుల్లో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి పెట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫారెస్ట్ ఎఫ్‌బీఓ, ఏబీఓ, సెక్షన్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, కార్యాలయాలకే పరిమితం కావడంతో ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయన్నారు. ఘటనలు జరిగిన ప్పుడు ఫారెస్ట్ అధికారులు స్పందిస్తున్నారే తప్ప జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వేటగాళ్ల ఉచ్చులో ప్రాణాలు కోల్పోయిన చిరుత గర్భిణి కావడం, రెండు మగకూనలు కడుపులోనే చనిపోవడంతో సర్వత్రా ఆవేదన వ్యక్తమైంది. అయ్యో..అధికారులు సరైన రీతిలో స్పందించి ఉంటే చిరుత ప్రాణాలతో పాటు మరో రెండు చిరుతలు బతికేవన్నారు.

**ఎక్విప్‌మెంట్ లేకపోవడంతోనే..**

ఫారెస్ట్ అధికారి సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు చిరుత మృతి ఘటనపై మాట్లాడుతూ... చిరుతను ఉచ్చు నుంచి తప్పించి, బోను సహాయంతో అడవిలోకి వదలిపెడదామని ప్రయత్నించామన్నారు. అయితే తమ వద్ద రెస్క్యూకు సంబంధించి సరైన ఎక్విప్‌మెంట్స్, నైపుణ్యం కలిగిన సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఇదే విషయాన్ని తిరుపతి జూ చీఫ్ కన్జర్వేటర్‌కు విషయం తెలిపితే.. ఆయన సాయంత్రం 4 గంటల తర్వాత చిరుత ఇన్‌యాక్టివ్ అవుతుందని, తర్వాత రక్షించవచ్చని తెలిపి, తాము వస్తున్నట్లుగా తెలిపారన్నారు. ఈలోపు జరగాల్సిన అనర్థం జరిగిపోయిందన్నారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం అటవీ ప్రాంతంలో ఉచ్చులు పెట్టడం, వన్యప్రాణుల సంచారానికి ఆటంకం కలిగించడం చట్టరీత్యానేరమని, దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పొన్నూటిపాళ్యం అడవిలో ఉచ్చులు ఎవరు, ఎందుకు వేశారనే విషయమై సమగ్ర విచారణ చేస్తామన్నారు.

### చిరుత మరణించిన ఘటనపై విచారణ జరిపించాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లి మండలం, పొన్నూటిపాళ్యం సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉచ్చులో చిక్కుకున్న చిరుతను రక్షించడంలో అటవీ అధికారులు తీవ్ర వైఫల్యం చెందారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత ఉచ్చుకు చిక్కుకుంటే దానిని కాపాడడంలో అధికారుల వైఫల్యం కళ్లకు కట్టినట్లు కనబడుతోందని ఆరోపించారు. ఉచ్చులో తగులుకున్న చిరుతను కాపాడలేకపోయిన అధికారులు, ఒకవేళ అదే చిరుత జనావాసాల్లోకి వచ్చి ఉంటే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

### వీరబల్లి మండలంలో చిరుతపులి సంచారం

– భయాందోళనలో ప్రజలు

**వీరబల్లి :** మండలంలోని సుగాలి తాండా సమీపంలో గత వారం రోజుల నుంచి చిరుతపులి సంచరిస్తున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. చిరుతపులి మేకలను వెంటాడి ఎత్తుకెళ్లిన ఘటనలు జరిగాయి. మంగళవారం అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే రైతు పొలంలో వెళ్తుండగా చిరుతపులి కనిపించడంతో భయాందోళనకు గురై ఇంటిలోకి పరుగులు తీశాడు. ఇంత జరుగుతున్నా ఫారెస్టు సిబ్బంది మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుతపులిని పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### స్కూటీని ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



సరోజ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె మౌనిక

**కమలాపురం :** కమలాపురం రైల్వే గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని రాం నగర్‌కు చెందిన మహిళ మృతి చెందింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాం నగర్‌కు చెందిన సరోజ(48) తన కూతురు మౌనికతో కలసి స్కూటీలో క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం పట్టణంలోకి వెళ్తుండగా రైల్వే గేటు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు స్కూటీని ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సరోజ స్కూటీ నుంచి కింద పడింది. ట్రాక్టర్ టైర్ తలపై ఎక్కడంతో సరోజ అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యా సాగర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుమార్తె మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సరోజ మృతి చెందిన విషయం తెలియడంతో రాం నగర్‌లో విషాద ఛాయలు అలుము కున్నాయి.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి





వెంకట జగదీశ్వర్ (ఫైల్) వేంపల్లె మౌలాలి (ఫైల్)

**చింతకొమ్మదిన్నె :** కడప–చిత్తూరు జాతీయ రహదారిపై బుగ్గలేటిపల్లె గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపల్లె మౌలాలి(19), వెంకట జగదీశ్వర్ (20) అనే ఇరువురు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మూలవంక గ్రామానికి చెందిన వేంపల్లె మౌలాలి, అతని స్నేహితుడు వెంకట జగదీశ్వర్‌తో కలిసి మంగళవారం రాత్రి బుగ్గలేటిపల్లె వద్ద డాబాకు భోజనానికి వెళ్లి తిరిగి ఇంటికి బైకుపై వస్తుండగా విష్ణు విద్యా మందిర్ స్కూల్‌కు వద్ద రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న వేంపల్లె మౌలాలి, వెంకట జగదీశ్వర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. వెంకట జగదీశ్వర్ అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. వేంపల్లె మౌలాలి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీంతో మూలవంక గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకట జగదీశ్వర్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నాడు. తండ్రి కరోనా కాలంలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు కావడంతో తల్లి, అక్క హృదయవిదారకంగా విలపించారు. మౌలాలి బీకాం చదువుతూ పారిశ్రామిక సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడని సమాచారం.

# ఆధునిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు

నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**రాయచోటి :** అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరిజ్ఞానం ద్వారా కేసుల దర్యాప్తులో వేగం పెంచుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులన ఆదేశించారు. బుధవారం రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్‌ల అధికారులతో ఎస్పీ అధ్యక్షతన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల సబ్ డివిజన్ పరిధిలో జరిగిన ముఖ్య నేర సంఘటనలు, వాటిపై చేపట్టిన విచారణలు, పరిష్కారాల పురోగతి తదితర అంశాలపై సమగ్ర సమీక్ష చేశారు. నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మహిళల భద్రత, మైనర్‌లపై జరుగుతున్న అకృత్యాల నిరోధం, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వ్యాప్తి అడ్డుకోవడం, మైనర్లు వాహనాలు నడపకుండా కఠిన చర్యలు, రౌడీషీటర్లపై నిఘా పెంచి కార్యకలాపాలను అణచివేయాలన్నారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేసే వారిని అరికట్టడం, సైబర్ నేరాలు తగ్గించడం వంటి పలు అంశాలపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోలీసు స్టేషన్ల పనితీరుపై పరిశీలన చేపట్టి ప్రజలతో మరింత సన్నిహితంగా ఉండే విధంగా ప్రజాసేవ దృక్పథంతో పనిచేయాలని సూచించారు. సమిష్టి కృషి, సమన్వయంతో పనిచేసి సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, మదనపల్లె డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాయచోటి అర్బన్, రూరల్ సీఐలు బీవీ చలపతి, ఎన్.వరప్రసాద్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లి తులసీరామ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అమృత్ భారత్ స్కీం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్‌గుప్త



గంతకల్లు డీఆర్‌ఎంకు సమస్యలను విన్నవిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

**రాజంపేట :** రాజంపేట రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్కీం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. బుధవారం రాత్రి రాజంపేట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్‌ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న పనుల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పన దిశగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. రైల్లో బోగీలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వెయిటింగ్ హాల్, స్టేషన్ బయట జరుగుతున్న పనుల నిర్మాణ దశలపై ఆరా తీశారు. డీఆర్‌ఎంతో పాటు సీనియర్ డీసీఎం మనోజ్, ఏడీఎన్ అహ్మదుల్లా, పలువురు డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డీఆర్‌ఎం దృష్టికి పలు సమస్యలు..**

రాజంపేట రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా పార్సిల్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని గంతకల్ డివిజనల్ రైల్వే యూజెస్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. డీఆర్‌ఎం రాజంపేటకు వచ్చిన సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజంపేట రైల్వే స్టేషన్‌లో పార్సిల్ కేంద్రం ఉండటం వల్ల ఈ ప్రాంత రైతుల ఉద్యాన వన ఉత్పత్తులకు దోహద పడుతుందన్నారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. పలురైళ్లు హాల్టింగ్ అంశాన్ని మరోసారి డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఈ యల్లయ్య, సీనియర్ డీఈఎన్ అభిరామ్, కడప సీసీఐ జనార్దన్, రాజంపేట రైల్వే స్టేషన్ మేనేజర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వక్ఫ్ పరిరక్షణ కమిటీ(జేఏసీ) జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్ పేర్కొన్నారు. బుధవారం ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో మహిళా కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో జరిగే కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనల ప్రకారం పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వక్ఫ్ పరిరక్షణ కమిటీ జేఏసీ జిల్లా మీడియా ఇన్‌చార్జి మగ్బూల్ బాషా మాట్లాడుతూ త్వరలో మహిళలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ నగర ఉపాధ్యక్షుడు ఆబిద్ హుస్సేన్, జేఏసీ కో కన్వీనర్లు రిజ్వానా, మెహనూర్, ఫాతిమా, నిరోఫర్, అక్కర్నిసా, హసీనా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలు అరెస్టు

- 27 బైకులు స్వాధీనం
- వివరాలను వెల్లడించిన మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ప్రొబేషన్ డీఎస్పీ టి.భవాని

**మైదుకూరు :** వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో బైకులను దొంగతనం చేస్తున్న ముగ్గురు అంతర్ జిల్లా బైక్ దొంగలను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 27 బైకులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. చాపాడు మండలంలోని సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద గత నెల 21న ఓ విద్యార్థికి చెందిన స్కూటీ చోరీకి గురైంది. ఆ మేరకు చాపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశంతో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ప్రొబేషన్ డీఎస్పీ టి.భవాని, రూరల్ సీఐ జె.శివశంకర్, చాపాడు ఎస్ఐ కె.చిన్న పెద్దయ్యలకు అందిన సమాచారం మేరకు బుధవారం ఉదయం చాపాడు మండలం అల్లాడుపల్లె క్రాస్ రోడ్డు, మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీని చేపట్టారు. ఆ సమయంలో ముగ్గురు యువకులు మోటారు బైక్‌లపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించారు. విచారణలో పట్టుబడిన వారు జిల్లాలోని లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ పవన్ కుమార్ రెడ్డి, కర్ణ లోకనాథ్‌రెడ్డి, పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీకి చెందిన గంగిరెడ్డి అశోక్‌రెడ్డిగా తేలారు. వీరు బైక్‌లను దొంగిలిస్తుంటారని తెలిసింది. మార్చి 21వ తేదీన సీబీఐటీ కాలేజీ వద్ద స్కూటీని తామే చోరీ చేసినట్లు వారు అంగీకరించారు. మరింత లోతుగా విచారించడంతో సత్యసాయి జిల్లా కదిరి, అనంతపురం జిల్లా తాడిపత్రి, వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు, కడప, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, తొండూరు, పులివెందుల పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 27 బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ చేసిన బైకులను విక్రయించేందుకు వెలిగండ్ల గ్రామంలో దాచి ఉంచినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ప్రొబేషన డీఎస్పీ టి.భవాని నిందితులను, బైకులను చూపించారు. మరో రెండు బైకులను స్వాధీనం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బైక్ దొంగలను పట్టుకోవడంలో ప్రధాన పాత్ర పోషించిన చాపాడు పోలీసులు వి.బ్రహ్మేంద్ర, మధుసూదన్‌రెడ్డి, సబ్ డివిజన్ క్రైం పార్టీకి చెందిన పోలీసులు తిరుమలయ్య, నవీన్, గణేష్, ప్రసాద్, రాఘవరెడ్డిలను అభినందించి వారికి రివార్డులను అందజేశారు. సమావేశంలో రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య పాల్గొన్నారు.



# అరుదైన శస్త్ర చికిత్సతో ప్రాణాలు పోశారు



ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన తరువాత మీడియా సమావేశం నిర్వహిస్తున్న వైద్య బృందం



రాయచోటి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో బాలుడికి వైద్యం చేస్తున్న డాక్టర్లు

**రాయచోటి టౌన్ :** ఒకప్పుడు రాయచోటిలో చిన్న పాటి చికిత్స చేయాలన్నా సరైన వైద్య నిపుణులు లేక తిరుపతి, కడప లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే ఇప్పుడిప్పుడే రాయచోటిలో కూడా కార్పొరేట్ స్థాయిలో శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని 100 గదుల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో దాదాపుగా రూ.25కోట్లు ఖర్చు చేసి పెద్ద భవనాలు నిర్మించారు. అందుకు తగ్గట్టుగానే వైద్యులను నియమించడంతో అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో..**

గాలివీడు మండలానికి చెందిన శృతి అనే పేద మహిళ మొదటి కాన్పు సమయంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. చివరికి శస్త్ర చికిత్స ద్వారా మొదటి కాన్పు జరుపుకొంది. ఆ సమయంలో ఆ సమయంలో ఏమి జరిగిందో తెలియదు కానీ మలం, మూత్రం రెండు ఒకే దారిలో రావడం మొదలయ్యాయి. దీనిని రెక్టో వేజైనల్ ఫిస్టులా అంటారు. అసలే పేద కుటుంబం కావడంతో కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి శస్త్ర చికిత్స చేయించుకోలేక తీవ్ర మనోవేదనను అనుభవించింది. ఈ క్రమంలో పది రోజుల క్రితం రెండవ కాన్పు కోసం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తన తల్లితో కలసి వచ్చింది. ఈ విషయం ఆస్పత్రి వైద్యుల దృష్టికి తీసుకెళ్లింది. సాధారణ కాన్పు చేసిన వైద్యులు తరువాత ఆమెకు ఉన్న పెద్ద సమస్యను కూడా గుర్తించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ జీనత్ బేగం, శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్, అనస్తీషియా డాక్టర్, ఇతర వైద్యులు కలిసి చర్చించారు. ఆమెకు ఉన్న సమస్యను పరిష్కరించాలంటే ఆపరేషన్ ఒక్కటే మార్గమని తీర్మానించారు. అందుకు ఆమె అంగీకారం తీసుకుని వెంటనే ఆమెకు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ జీనత్ బేగం, డాక్టర్ బండారు కిరణ్‌కుమార్, డాక్టర్ శివ, డాక్టర్ అజాజ్ అహమ్మద్‌తో కలసి ఆపరేషన్ చేశారు.

**శ్రీ వెంకటేశ్వర ఆస్పత్రిలో...**

రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఒకే రోజు రెండు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి ప్రాణదానం చేశారు. గాలివీడుకు చెందిన బాలుడు నీటి కుంటలో పడిన సమయంలో ఊపిరి ఆడక పోవడంతో పాటు అదే సమయానికి గుండెకు ఆక్సిజన్ అందకపోవడంతో గుండె పోటు వచ్చింది. స్థానికులు గమనించి రాయచోటికి తరలించారు. శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి స్పందించి ఆపరేషన్ చేసి బాలుడి ప్రాణాలను కాపాడారు. అలాగే మంగళవారం రాత్రి ఒక మధ్య వయస్సు వ్యక్తి కంటి కింద దవడ భాగం తీవ్రంగా బాధిస్తోందని చెప్పడంతో స్కానింగ్ చేసి బ్లాక్ ఫాక్స్ ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్ల సలహా మేరకు వారి పర్యవేక్షణలో ఆపరేషన్ చేసి దవడ ఎముక తొలగించి దాని స్థానంలో మరొకటి అమర్చారు.

### ప్రభుత్వ స్థలంలో రాళ్లు పాతిన కేసులో ఆరు నెలల జైలు

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని టి.సదుం పంచాయతీ రేకులగుంటిపల్లికి చెందిన శీత వెంకట్రమణారెడ్డి అనే వ్యక్తి 2015లో ప్రభుత్వ స్థలంలో వీధికి అడ్డంగా రాళ్లు నాటాడు. అప్పట్లో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అప్పటి పంచాయతీ వీఆర్‌ఓ వెంకట్రమణ అలియాస్ రమణ గ్రామానికి వెళ్లి విచారించి ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నాటిన రాళ్లను తొలగించాలని వెంకట్రమణారెడ్డికి సూచించారు. అయితే ఆక్రమణదారుడు ప్రభుత్వ అధికారి ఆదేశాలను సైతం బేఖాతరు చేయడమే గాక వీఆర్‌ఓపై దౌర్జన్యం చేస్తూ బెదిరించాడు. ఈ విషయంపై బాధిత వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కేసు తుది విచారణకు రావడంతో బుధవారం తంబళ్లపల్లి కోర్టు ఏపీపీ వీరాంజనేయులు కేసు వాదోపవాదాలను న్యాయమూర్తికి వినిపించారు. ఈ తరుణంలో కేసు పూర్వాపరాలు పరిశీలించిన తంబళ్లపల్లి కోర్టు న్యాయమూర్తి ఉమర్ ఫారూక్ నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకట్రమణారెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్ఐ హరిహర ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ బావాజాన్ తెలిపారు.